

తేరుకుంటున్న 'ఫెంగల్' బాధిత ప్రాంతాలు

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ధాటికి దెబ్బతిన్న ప్రాంతాలు క్రమంగా కోలుకుంటున్నాయి. ఆ ప్రాంతాల ప్రజలు ఇపుడిపుడే తమ ఇళ్ళకు చేరుకుంటున్నారు. మరోవైపు వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఫెంగల్ ప్రభావంతో నవంబరు 29వ తేదీ నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు పలు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా, తిరువణ్ణామలై, కళ్ళకుర్చి, విల్లుపురం, కడలూరు, ధర్మపురి, సేలం, కృష్ణగిరి జిల్లాల్లో అపార నష్టం వాటిల్లింది. ముఖ్యంగా విల్లుపురం జిల్లా వ్యాప్తంగా ఏకంగా 63 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. వరద బాధిత ప్రాంతాల్లో గత మూడు రోజులుగా సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ జిల్లాలో తనెపెన్నై నదిలో వరద ఉధృతిలో చిక్కుకుని 14 మంది వరకు మరణించారు. ఇంకో వైపు ఈ ఈ నదిలో వరద నీటి ప్రవాహం క్రమంగా తగ్గుతోంది.



దీంతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు కూడా తగ్గుముఖం పట్టింది. కడలూరు జిల్లాలో పది వేలకు పైగా ఇళ్ల నీటిలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం పర్యవేక్షణలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

అర్ధ వార్షిక పరీక్షలు వాయిదా

ఫెంగల్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో జరగాల్సిన అర్ధ వార్షిక పరీక్షలను జనవరికి వాయిదా వేసినట్టు పాఠశాల విద్యాశాఖా మంత్రి అన్బిల్ మహేశ్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అర్ధ వార్షిక పరీక్షలు ఈ నెల 2 నుంచి ప్రారంభంకావాల్సి ఉందన్నారు. అయితే, ఫెంగల్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పలు జిల్లాల్లో అపారనష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితులు అనుకూలిస్తే ఈ నెల 9 నుంచి అర్ధసంవత్సర పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. అయితే, వరద బాధిత జిల్లాల్లో మాత్రం జనవరికి వాయిదా వేసినట్టు ఆయన వెల్లడించారు.

తిరువణ్ణామలైకి కార్తీక శోభ

ఘనంగా దీపోత్సవ వేడుకలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో పరాశక్తి, మీనాక్షి అమ్మవార్లు



ఆలయంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో బుధవారం తెల్లవారుజామున ధ్వజారోహణంతో కార్తీక దీపోత్సవాలు ప్రారంభమయ్యాయి. తిరువణ్ణామలైలో ప్రతి ఏటా నిర్వహించే కార్తీక దీపోత్సవాలు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయి. ఈ ఏడాది వేడుకలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉన్న తంజై ప్రాకారంలో ఆలయ ప్రధాన శివాచార్యులు విశ్వనాథ గురుకల్ ధ్వజస్తంభంపై ధ్వజారోహణం చేశారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున 4 గంటలకు ఆలయంలోని మూలస్థానాలకు అభిషేకాలు చేసి, ఆలయంలోని మూలస్థాన దేవతామూర్తులకు మహాదీపారాధన నిర్వహించారు.

10న మహా రథోత్సవం...

వేడుకల్లో భాగంగా ఈ నెల 10వ తేది మహా రథోత్సవం జరుగనుంది. తెల్లవారుజామున 6 గంటలకు వినాయకుడు రథం, పంచమూర్తుల రథాలు, మహా రథం మాడవీధుల్లో ఊరేగింపుగా రానున్నాయి. అలాగే, 9న వెండి రథోత్సవం, 13వ తేది వేడుకల్లో ప్రధానాంశంగా తెల్లవారుజామున 4 గంటలకు ఆలయంలో భరణి దీపం, సాయంత్రం 6 గంటలకు కొండ శిఖరంపై మహా దీపం వెలిగించనున్నారు. ఈ వేడుకలకు లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో, అన్ని వసతులు సమకూర్చినట్లు ఆలయ నిర్వాహకులు, జిల్లా యంత్రాంగం తెలిపారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి, ఆలయ ట్రస్టీ అధ్యక్షుడు జీవానందం, ఆలయ శివాచార్యులు రమేష్, కీర్తివాసన్, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



ధ్వజ పతాకం ఎగురవేస్తున్న శివాచార్యులు

ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు మెడికోల సస్పెన్షన్

ప్యారీస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలోని ఓమందూర్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు మెడికోలపై కళాశాల యాజమాన్యం చట్టపరమైన చర్యలు తీసుకుంది. వారిని హాస్టల్ నుంచి ఖాళీ చేయించి తలా రూ.20 వేలు జరిమానా విధించింది. ఎంబీబీఎస్ విద్యార్థి ఆన్‌లైన్‌లో ర్యాగింగ్ నిరోధక కార్యాలయానికి ఫిర్యాదు పంపించారు. అందులో ప్రాక్టికల్స్ పాఠ్యాంశాలను రాసివ్వాలంటూ సీనియర్లు తనను ర్యాగింగ్ చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారం యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) దృష్టికి వెళ్లింది. దీనిపై అందిన ఉత్తర్వుల మేరకు ఓమందూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరవింద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సంబంధిత విద్యార్థులను విచారించి నివేదిక సమర్పించారు. ఈ నివేదికను కళాశాల యాజమాన్యం పోలీస్ అసిస్టెంట్ కమిషనర్లతో కూడిన కమిటీ పరిశీలించింది. జూనియర్ మెడికోపై ర్యాగింగుకు పాల్పడిన ముగ్గురు సీనియర్ విద్యార్థులను ఎనిమిది నెలల పాటు హాస్టల్ నుంచి ఖాళీ చేయించడంతో పాటు వారికి తలా రూ.20 వేలు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



రాజధాని కళాశాల హాస్టల్ భవనసముదాయాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రాజధాని కళాశాలలో మౌలిక వసతులు

దివ్యాంగ విద్యార్థులకు రూ.21.60 కోట్లతో హాస్టల్ భవనాలు ● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్‌లోని రాజధాని కళాశాలలో రూ.21.60 కోట్లతో నిర్మించిన కొత్త హాస్టల్ భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. 2022 జూలై 5న జరిగిన ఆ కళాశాల స్నాతకోత్సవంలో స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరైనప్పుడు కళాశాలలో చదువుతున్న దివ్యాంగులైన విద్యార్థినీ విద్యార్థులకు హాస్టల్‌భవనాలను నిర్మించాలని విద్యార్థులు, అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిని పరిశీలించిన స్టాలిన్ ఉన్నత విద్యాశాఖ ద్వారా హాస్టల్ భవనాలను నిర్మించేందుకు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ. రెండంతస్థులతో ఈ హాస్టల్ భవన సముదాయాన్ని నిర్మించామని, ఇందులో దివ్యాంగులైన విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరు వసతి గృహాలు ఉన్నాయని చెప్పారు. 114 మంది విద్యార్థులు, 96 మంది విద్యార్థినులు బసచేసేందుకు అనువుగా ఈ హాస్టల్ భవన సముదాయాన్ని నిర్మించినట్లు ఆయన వివరించారు. ఈ హాస్టల్ గదుల్లో దివ్యాంగులైన విద్యార్థులకు దారిని సూచించేలా నేలపై సర్ఫేస్ ఇండికేటర్లున్నాయని, అన్ని గదుల్లో ఎమెర్జెన్సీ బెల్స్, ప్రత్యేక లిఫ్టులున్నాయని తెలిపారు.





రాజధాని కళాశాల హాస్టల్ భవనం - స్టాలిన్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

విద్యార్థులతో భేటీ...

ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్ళిన ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. దివ్యాంగులైన విద్యార్థినులు స్టాలిన్‌తో మాట్లాడాలని పోటీపడ్డారు. పలువురు విద్యార్థినులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఆ తర్వాత స్టాలిన్ కళాశాలలో అందుతున్న సదుపాయాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఏవైనా సదుపాయాలు కావాలా అని అడిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, కోవి చెళియన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.గోపాల్, కళాశాల విద్యా సంచాలకులు ఎ.సుందరవళ్ళి తదితరులు పాల్గొన్నారు.



చెన్నై వాల్‌టాక్స్‌రోడ్డు ప్రాంతంలో బుధవారం సాయంత్రం జరిగిన సభలో ఉత్తర చెన్నై అభివృద్ధిలో భాగంగా రూ.1383 కోట్లతో చేపట్టనున్న పథకాలను ప్రారంభించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులా?

- హిందూ సంస్థల ఆగ్రహం
- చెన్నైలో రాస్తారోకో
- బీజేపీ నేతలు తమిళిసై, హెచ్ రాజా సహా పలువురి అరెస్టు



రాస్తారోకోలో పాల్గొన్న హిందూ సంస్థల నేతలు, బీజేపీ నేత హెచ్ రాజా తదితరులు

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా హిందూ సంస్థలు. ఆర్‌ఎస్ఎస్, హిందూ మున్నాని, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఏబీవీపి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ధర్నా, రాస్తారోకోలు జరిగాయి. రాజధాని నగరం చెన్నైలో, వాణిజ్యనగరం కోయంబత్తూరులో బంగ్లాదేశ్ హిందువుల విముక్తి సంస్థ ఆధ్వర్యంలో రాస్తారోకో జరిపారు. ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం వద్ద చేపట్టిన ధర్నాలో బీజేపీ మహిళానేత డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, వ్యవస్థాపక కార్యదర్శి కేశవ వినాయకన్, డిప్యూటీ అధ్యక్షుడు కరు నాగరాజన్, రాష్ట్ర కమిటీ కార్యదర్శి సుమతి వెంకటేష్, జిల్లా శాఖల నాయకులు ధనశేఖరన్, కృష్ణకుమార్, మనోహర్, సాయి సదన్, కాళిదాస్, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి లతా షణ్ముగం తదితరులు పాల్గొన్నారు. పోలీసుల అనుమతి లేకుండా ఆ ఆందోళన జరుగటంతో డాక్టర్ తమిళిసై సహా సహా 500 మందిని పోలీసులు అరెస్టు చేసి, స్వామిశివానందసాలైలో, ఎగ్మూరులో కల్యాణమండపాలకు తరలించారు. అందరినీ సాయంత్రం ఆరుగంటలకు విడుదల చేశారు.

కోవైలో ...

కోయంబత్తూరులో సంస్థ జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఆందోళనలో బీజేపీ నేత హెచ్ రాజా పాల్గొన్నారు. ఆందోళనలో పాల్గొన్నవారంతా బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని బీజేపీ నేత హెచ్ రాజా సహా సుమారు 500 మందిని అరెస్టు చేసి సమీపంలోని కల్యాణమండపాలకు తరలించారు. ఈ సందర్భంగా హెచ్‌రాజా మీడియాతో మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నాయకత్వంలోని ప్రభుత్వాన్ని ప్రధాన ప్రతిపక్షాలు, సైనికుల ఉమ్మడి కుట్ర ద్వారా కూలగొట్టారని, ఆ దేశంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి హిందువులపై దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. మైనారిటీలుగా ఉన్న హిందువులను రక్షించడానికి బదులు వారి దాడులకు పాల్పడటం సముచితమేనా అని ప్రశ్నించారు.



ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం వద్ద అరెస్టయిన డాక్టర్ తమిళిసై

15న అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం

రెండువేల మందికి ప్రత్యేక ఆహ్వానం

ప్యారీస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశం ఈ నెల 15వ తేదీ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడపాడి పళనిస్వామి అధ్యక్షతన జరగనుంది. ఈ నేపథ్యంలో, మొదటి సారిగా 2000 మందిని ప్రత్యేకంగా ఈ సమావేశానికి ఆహ్వానించారు. రాష్ట్ర స్థాయి పార్టీ , జిల్లా నిర్వాహకులు, ప్రాంతీయ కార్యదర్శులు, ఎంజీఆర్ యువజన, విద్యార్థి, కార్మిక, వైద్య, న్యాయవాద, మహిళా విభాగాల నాయకులు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. పార్టీలో చోటు చేసుకున్న ముఠా రాజకీయాలకు స్వస్తి పలికేలా అసంతృప్తి పరులను తృప్తిచేసేలా ఈపీఎస్ ఈ ప్రయత్నం చేపట్టారు. 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మెజార్టీ సీట్లలో గెలిచే బాధ్యతలను సర్వసభ్య సమావేశంలో పాల్గొనే ప్రత్యేక ఆహ్వానితులకు ఈపీఎస్ అప్పజెప్పనున్నట్లు అన్నా డీఎంకే వర్గాలు తెలియజేశారు.

రెండు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

నిలిచివున్న లారీని జీపు ఢీకొని ముగ్గురు ● కోళ్ల వ్యాన్ ఢీకొని ఇద్దరి మృతి

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. వివరాలిలా వున్నాయి... స్థానిక కరుగమ్‌పుత్తూర్ సమీపంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ఓ లారీ ఆపారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఓ జీపు అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో చెన్నై మనలికి చెందిన మాలిక్ బాషా సహా ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనలో గాయపడిన ఒకరిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఘటనా స్థలాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎస్పీ మణివన్నన్ పరిశీలించారు. కాగా, ఇదే ప్రాంతంలో మంగళవారం సాయంత్రం లారీని కోళ్ల లోడుతో వెళ్తున్న వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



సమాచార దర్శిని

రేపటి నుంచి పబ్లిక్ పరీక్షల దరఖాస్తులు

పెరంబూర్, డిసెంబరు 4: రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాసే ప్రైవేటు అభ్యర్థులు శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్ష శాఖ విడుదల చేసిన ప్రకటనలో... అభ్యర్థులు తమ తమ జిల్లాలోని ప్రభుత్వ పరీక్ష శాఖ కార్యాలయాలకు వెళ్లి ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

ఓఎంఆర్‌లో రూ.3.50 కోట్లతో పార్కులు

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూర్ మండలం 195వ వార్డులోని ఓఎంఆర్‌లో అపార్ట్‌మెంట్లు, ఐటీ సంస్థలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పార్కుల ఏర్పాటుకు సిద్ధం చేసిన స్థలం 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఈ క్రమంలో, ప్రజల కోరిక మేరకు సెక్రటరీయేట్ కాలని, అళికంగేశ్వరర్ నగర్, ఎళిల్ నగర్ సహా ఐదు ప్రాంతాల్లో పిల్లల క్రీడా మైదానంతో కూడిన పార్కులు ఏర్పాటుకానున్నాయి. కబడ్డీ, టెన్నిస్ క్రీడా మైదానాలు, వాకింగ్ ట్రాక్ తదితరాలతో రూ.3.49 కోట్లలో పార్కులు ఏర్పాటుచేయనున్నట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

12న నాగపట్టిణం జిల్లాకు సెలవు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లా నాగూర్ దర్గా 468వ ఉరుసు ఉత్సవాలు గత సోమవారం పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో ప్రధానాంశమైన పవిత్ర గంధం ఊరేగింపు 12వ తేది ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా 12వ తేది జిల్లాకు సెలవుగా ప్రకటించిన జిల్లా కలెక్టర్, ఆ రోజు బదులు 21వ తేది (శనివారం) పని దినంగా ప్రకటించారు.

కొండ రైలు సేవలు ప్రారంభం

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ-మేట్టుపాళయం మధ్య కొండ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా ఊటీ-మేట్టుపాళయం మధ్య రైలుపట్టాలపై మట్టిచెరియలు విరిగిపడడంతో, కొండ రైలు సేవలు తాత్కాలికంగా రద్దు చేశారు. రైలు పట్టాలపై పడిన మట్టి చెరియలను రైల్వే సిబ్బంది తొలగించిన నేపథ్యంలో, బుధవారం నుంచి ఊటీ-మేట్టుపాళయం మధ్య రైలు సేవలు ప్రారంభమయ్యాయి.

మేట్టూరు జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు జలాశయానికి నీటి రాక పెరిగింది. కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మేట్టూరు జలాశయానికి వస్తున్న నీటి రాక బుధవారం ఉదయం 8 గంటలకు 32,240 ఘనపుటడుగులకు పెరిగింది. డ్యాం నుంచి డెల్టా సాగుకు వెయ్యి ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తుండగా, ప్రస్తుతం డ్యాంలో 113.21 అడుగుల నీటి మట్టాలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలమట్టాలు

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నీలగిరి జిల్లా మినహా మిగిలిన జిల్లాల్లో నీటిమట్టాలు పెరిగాయి. ప్రజాపనుల శాఖ ప్రతినెలా భూగర్భ జలమట్టాలను లెక్కిస్తుంది. ఈ నేపథ్యంలో, తాజా గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు పెరిగాయి. తిరువళ్లూర్ జిల్లాలో అక్టోబరులో 3.78 మీటర్ల లోతున్న భూగర్భ జలమట్టాలు, నవంబరు నెలలో 2.98 మీటర్లకు పెరిగాయి. కాంచీపురం జిల్లాలో 3.22 మీటర్ల నుంచి 2.62 మీటర్లు, చెంగల్పట్టు జిల్లాలో 3.26 మీటర్ల నుంచి 2.74 మీటర్లు పెరిగాయని అధికారులు తెలిపారు.

డెల్టా జిల్లాలకు యథావిధిగా రైళ్లు

పెరంబూర్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాలకు యధావిధిగా రైళ్ల సేవలు ఉంటాయని దక్షిణ రైల్వే తెలిపింది. విక్రవాండి-ముండియంబాక్కం మధ్య రైలు పట్టాలపై భారీగా నీరు చేరడంతో కన్నియాకుమారి, సెంగోట్టై సహా డెల్టా జిల్లాలకు వెళ్లే 12 ఎక్స్‌ప్రెస్ రైళ్లు మరో మార్గంలో నడుపగా, 15 రైళ్లు రద్దు చేశారు. రైలు పట్టాలపై నీరు తొలగించిన నేపథ్యంలో, ఈ మార్గంలో రైళ్లను తక్కువ వేగంతో నడుపడంతో పలు రైళ్లు గంట నుంచి మూడు గంటల ఆలస్యంగా నడిచాయి. రైలుమార్గాన్ని పరిశీలించిన అధికారులు సంతృప్తి వ్యక్తం చేయడంతో, మంగళవారం రాత్రి ఎగ్మూర్ నుంచి డెల్టా జిల్లాలకు వెళ్లే రైళ్లు యధావిధిగా నడిచాయని అధికారులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో 'పెయిడ్' వార్డులు

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమత కలిగిన వారు చికిత్స పొందేలా, 40 ప్రభుత్వాసుపత్రుల్లో పెయిడ్ వార్డులు ఏర్పాటుచేసినట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మాత్రమే పెయిడ్ వార్డులుండగా, ఆర్థిక స్థోమత కలిగిన వారు, పార్టీ నేతలు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 40 ప్రభుత్వాస్పత్రుల్లో రూ.1,000- రూ.1,500 ఛార్జీతో ప్రత్యేక గదులతో కూడిన వార్డులు ఏర్పాటుచేయనున్నట్లు, వాటిలో టీవీ, స్నానపు గది, టాయిలెట్, వేడి, చల్లటి నీరు తదితర వసతులుంటాయని మంత్రి తెలిపారు.

భారీగా పెరిగిన కోడిగుడ్డు ధర

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జోన్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా కోడిగుడ్డు ధర పెరిగిపోయింది. వీటి ధర ఒకేసారి రూ.5.90లకు చేరుకుంది. నామక్కల్ జోన్‌లోనే కోడిగుడ్డు ధర రూ.6.50లు ఉంది. ఇక్కడ కోడిగుడ్లలో 52 గ్రాముల కోడిగుడ్లకు మాత్రం నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ ధర నిర్ణయిస్తుంది. మంగళవారం ఒక్కో కోడిగుడ్డుపై 5 పైసలు పెంచి రూ.5.90గా ధర నిర్ణయించారు. పండుగలు వస్తున్న నేపథ్యంలో వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

కొడైకెనాల్‌ను కప్పేసిన మంచుదుప్పటి

● వాహనచోదకుల ఇబ్బందులు


కొడైకెనాల్‌దారిలో మంచులో హెడ్‌లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనం

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో బుధవారం వేకువజాము నుంచి దట్టమైన మంచు కురియడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత రెండు రోజులుగా ఆ ప్రాంతంలో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. అన్ని చోట్లా చలిగాలులు వీస్తుండటంతో స్థానికులు ఎక్కడికీ కదలలేకపోతున్నారు. పర్యాటకుల సంచారం కూడా తగ్గింది. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజాము నాలుగు గంటల నుంచి చిరుజల్లులతోపాటు దట్టమైన మంచు కొడైకెనాల్‌అంతా ఆవరించింది. వీటికి తోడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫారా కూడా నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో వాహన చోదకులు హెడ్‌లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది.

కృష్ణగిరిలో బండరాయి పడి ఇంటి ప్రహరీ ధ్వంసం


ప్రహరీగోడపై పడిన బండరాయి

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరిలోని పాతపేట కొండపై నుండి ఓ పెద్ద బండరాయి జారిపడి ఓ ఇంటి ప్రహరీ ధ్వంసమైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ కొండపై తరచూ మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. బుధవారం ఉదయం ఆ కొండపై నుంచి బండరాయి దొర్లుకుంటూ మేల్‌వీధిలో నివసిస్తున్న వెంకటాచలం అనే వ్యక్తికి చెందిన ఇంటి ప్రహరీపై పడింది. ఈ సంఘటనలో ప్రహరీగోడ పూర్తిగా ధ్వంసమైంది. ఆ బండరాయి మరికాస్త ముందుకు జారి పడి ఉంటే ఇంటిలో ఉన్న వెంకటాచలం, భార్యా పిల్లల ప్రాణాలకు ముప్పు కలిగిఉండేది. సమాచారం అందుకుని తహసీల్దార్ వలర్మతి, ఎస్సీ మురళి ఇతర అధికారులు ఆ స్థలానికి వెళ్ళి విచారణ జరిపారు.

మాజీ సైనిక సంక్షేమ సంఘం సమావేశం


సహాయాలు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిత్తూరు బస్టాండ్ సమీపంలోని బీఎస్సీ క్యాంటీన్ ఆవరణలో బీఎస్ఎఫ్ 59వ ప్రారంభోత్సవ వేడుకలు బుధవారం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. మాజీ సైనికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, విద్యా రిజర్వేషన్లు కేటాయింపు, ఉద్యోగావకాశాలు, స్థలం కేటాయింపు, క్యాంటీన్‌కు మద్యం హక్కుల కేటాయింపు సహా పలు తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లులకు సంక్షేమ సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో పళనిస్వామి, చంద్రన్, రాజేంద్రన్, జయరామన్, పాండ్యన్, ప్రభాకరన్, వెంకటేశన్ సహా పలువురు పాల్గొన్నారు.

రెండాకుల చిహ్నం వివాదంపై ఓపీఎస్ అభిప్రాయాలు తెలుసుకోండి


● ఈసీకి మద్రాసు హైకోర్టు ఆదేశం



చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెండాకుల చిహ్నం వివాదంపై మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) అభిప్రాయాలను సమగ్రంగా తెలుసుకుని నాలుగు వారాల తర్వాత తగిన నిర్ణయం తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి మద్రాసు హైకోర్టు ఆదేశించింది. దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి అనే ప్రముఖుడు అన్నాడీఎంకే సంస్థాగత ఎన్నికలు, సర్వసభ్యమండలి సమావేశాలు పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా జరిగాయని 2017 నుంచి 2022 దాకా కేంద్ర ఎన్నికల సంఘానికి పలు మార్లు ఫిర్యాదు చేశానని, అదే సమయంలో రెండాకుల గుర్తు అన్నాడీఎంకేకు కేటాయించకూడదని కూడా వినతిపత్రాలు సమర్పించానని, వీటిపై సంఘం ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తాను సమర్పించిన వినతిపత్రాలపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని హైకోర్టుకు సమర్పించిన పిటిషన్‌లో తెలిపారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు ఆర్ సుబ్రమణియన్, సి.కుమారప్పన్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ ఫిర్యాదులకు సంబంధించి తమ సంఘం అన్నాడీఎంకేకు నోటీసులిచ్చిందని, ఆ నోటీసులు అందినట్లు పార్టీ నుండి వర్తమానం లభించిందని, ఈ విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎన్నికల సంఘం తరపున హాజరైన న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ వాదించారు. కేంద్ర ఎన్నికల సంఘం రెండాకుల గుర్తుపై నిర్ణయాన్ని తీసుకోవడానికి ముందు ఓపీఎస్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలివ్వాలని ఓపీఎస్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అరవింద్ పాండ్యన్ వాదించారు. వాద ప్రతివాదనల అనంతరం ఓపీఎస్ తరపు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న తర్వాతే రెండాకుల గుర్తుపై నాలుగు వారాల్లోగా తుది నిర్ణయాన్ని ప్రకటించాలని ధర్మాసనం ఆదేశించింది.

షావుకారుపేటలో 1.3కేజీల మత్తుమందు స్వాధీనం

● నలుగురి అరెస్టు



చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట ఎడపాళయంలో 1.3 కేజీల ఓపియం అనే మాదకద్రవ్యంతో సంచరిస్తున్న నలుగురిని ఎలిఫెంట్‌గేట్ పోలీసులు అరెస్టు చేశారు. ఎడపాళయంలో మాదకద్రవ్యాల అమ్మకాలు జరుగుతుందనే సమాచారంతో మంగళవారం రాత్రి పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా వేశారు. ఆ సమయంలో అనుమానాస్పదరీతిలో సంచులు పట్టుకుని తిరుగుతున్న దినేష్ చౌదరి (32), చేతన్‌సింగ్ (38), చెన్నారామ్ (48) అనే వారిని అరెస్టు చేశారు. వారు అందించిన సమాచారం మేరకు ప్రేమ్ ప్రకాష్ (39) అనే మరొక వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 1.3 కేజీల మత్తుమందును, ఐదు సెల్‌ఫోన్లు, రెండు తూనిక యంత్రాలు, ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

తిరువణ్ణామలైలో ఏడుగురి మృతదేహాలకు మంత్రి నివాళి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో ఫెంగల్ తుఫాన్ కారణంగా ఈ నెల ఒకటో తేదీ కుంభవృష్టి కురిసింది. దీంతో తిరువణ్ణామలై కొండచరియలు విరిగిపడటంతో ఏడుగురు మరణించారు. మట్టిపెళ్ళల కింద నుంచి ఈ మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం అనంతరం బంధువుల కుటుంబాలకు అప్పగించారు. ఈ మృతదేహాలకు మంత్రి ఏవీ వేలు బుధవారం నివాళులర్పించారు. మంత్రి వెంట జిల్లా ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. ఈ ఘటనలో రాజ్‌కుమార్ (32), ఈయన భార్య మీనా (26), కుమారుడు గౌతం (9), కుమార్తె ఇనియ (7), వీరి బంధువుల పిల్లలైన మహా (12), రమ్య (12), వినోదిన (14) అనే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కొండచరియలు కింద చిక్కుకున్న ఈ మృతదేహాలను తమిళనాడు కమాండో దళం, అగ్నిమాపక సిబ్బంది మూడు రోజుల పాటు శ్రమించి వెలికి, పోస్టుమార్టం తర్వాత మృతదేహాలను మంగళవారం రాత్రి అప్పగించిన విషయం తెల్సిందే.

వరదసాయంగా రూ.2 వేల కోట్లు కేటాయించాలి

డాక్టర్ అన్బుమణి రాందాస్

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో అపారనష్టం వాటిల్లిందని, ఈ ప్రాంతాల్లో బాధితులను ఆదుకునేందుకు కేంద్రం తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి కోరారు. ఇదే విషయంపై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా తిరువణ్ణామలై, కళ్ళకుర్చి, విల్లుపురం, కడలూరు, ధర్మపురి, సేలం, కృష్ణగిరి జిల్లాల్లో అపారనష్టం వాటిల్లిందని, ఈ జిల్లాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఈ నష్టాన్ని వివిధ కేటగిరీలుగా విభజించి తగిన సాయం చేయాలని కోరారు. పూర్తి నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక బృందాన్ని పంపించాలని ఆయన కోరారు.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం-చెన్నై ఎగ్మూర్, సంబల్‌పూర్-ఈరోడ్ ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.8557 విశాఖపట్టణం-చెన్నై ఎగ్మూర్ స్పెషల్ ఈ నెల 7,14,21,21, జనవరి 4,11,18,25, ఫిబ్రవరి 1,8,15,22, మార్చి 1వ తేదీల్లో విశాఖపట్టణం నుంచి రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. అలాగే, నెం.08558 చెన్నై ఎగ్మూర్-విశాఖపట్టణం స్పెషల్ ఈ నెల 8,15,22,29, జనవరి 5,12,19,26, ఫిబ్రవరి 2,9,16,23, మార్చి 2వ తేదీల్లో చెన్నై ఎగ్మూర్ నుంచి ఉదయం 10.30 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.35 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుంది.

● నెం.08311 సంబల్‌పూర్-ఈరోడ్ స్పెషల్ ఈ నెల 11,18,25, జనవరి 1,8,15,22,29, ఫిబ్రవరి 5,12,19,26 మార్చి 5 తేదీల్లో సంబల్‌పూర్‌లో ఉదయం 11.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. అలాగే, నెం.08312 ఈరోడ్-సంబల్‌పూర్ స్పెషల్ ఈ నెల 13,20,27, జనవరి 3,10,17,24,31, ఫిబ్రవరి 7,14,21,28, మార్చి 7 తేదీల్లో మధ్యాహ్నం 2.45 గంటలకు ఈరోడ్‌లో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

బాలకార్మికులకు విముక్తి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూలైలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న బాలకార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. చూలై సట్టన్నన్ నాయకన్ వీధిలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సరిఫుల్ హాక్ నగల తయారీ దుకాణం నడుపుతున్నాడు. ఈ దుకాణంలో బాల కార్మికులు పనిచేస్తున్నారని గిండిలోని పారిశ్రామిక భద్రత శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇళవరసన్‌కు సమాచారం అందింది. ఆయన పెరియమేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో, పోలీసులు మంగళవారం ఆ దుకాణంలో తనిఖీ చేపట్టగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఏడుగురు బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి వారికి విముక్తి కల్పించిన పోలీసులు రాయపురంలోని చిల్డ్రన్ హోంకు తరలించి, దుకాణ యజమానిని విచారిస్తున్నారు.

నీటమునిగిన పంట


దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం మేలపాడి శివపురం ప్రాంతంలో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు సుమారు 20 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నీటమునిగింది. ఈ ప్రాంతంలోని వరద నీరు అయ్యవీరాన్‌తాంగ్ చెరువుకు వెళ్లేదని, ప్రస్తుతం రహదారి పనుల కారణంగా నీరు వెళ్లే దారిలేక పొలాల్లోకి ప్రవేశించిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డీఎంకే జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గుడియాత్తం ప్రభుత్వాసుపత్రిలో జరిగిన కార్యక్రమానికి యువజన విభాగం ఉప ఆర్గనైజర్ సత్యమూర్తి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే అములు విజయన్ ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ రవి, గుడియాత్తం యూనియన్ అవై అధ్యక్షుడు మురళీధరన్, ఉప కార్యదర్శులు పద్మనాభన్, అరుణాచలం, పంచాయతి అధ్యక్షుడు సత్యదాసన్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాకేజీ టెండర్ల విధానం రద్దు కోరుతూ పిటిషన్

ప్యారీస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): రహదారుల శాఖలో రోడ్ల నిర్మాణం పనులకు సంబంధించి ప్యాకేజీ టెండర్ విధానం రద్దు చేయాలని కోరుతూ ఎనిమిది మంది కాంట్రాక్టర్లు మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటీషన్ దాఖలు చేశారు. పుదుకోట జిల్లాకు చెందిన ముత్తుకుమార్, రాయర్, రంగరాజన్‌తో సహా ఎనిమిది మంది ప్రభుత్వ లైసెన్స్ పొందిన కాంట్రాక్టర్లు దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో నాబార్డ్ ద్వారా చేపడుతున్న రోడ్ల పనులకు సంబంధించి వేర్వేరుగా టెండర్ నిర్వహించాలనే నిబంధనలున్నాయి. అయితే ప్రజా పనుల శాఖలో అవలంభిస్తున్న ప్యాకేజీ టెండర్ విధానాన్ని రహదారుల శాఖలో అమలు చేయడం చట్ట విరుద్ధమని పిటిషనర్లు ఆరోపించారు. అదే విధంగా మరి కొంతమంది కాంట్రాక్టర్లు కూడా పిటిషన్లు వేశారు. బుధవారం ఈ పిటీషన్లు న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, మరియా గ్లాడ్‌ల ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. అప్పుడు పిటీషనర్లు, ప్రభుత్వం తరుపు న్యాయవాదులు వాదించగా న్యాయమూర్తుల బెంచ్ రికార్డు చేసుకుని తేదీ ప్రకటించకుండా వాయిదా వేశారు.

విద్యుదాఘాతానికి కార్మికుడి మృతి

ఐసీఎఫ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంబత్తూరులో కొబ్బరి చెట్టు కాయలు కోస్తూ గుణశేఖరన్ అనే ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అంబత్తూరు సూరపట్టు మేట్టూరు ఆరో వీధికి చెందిన గుణశేఖరన్ మంగళవారం సాయంత్రం పారిజాతం వీధిలోని ఓ ఇంటి వద్దనున్న కొబ్బరి చెట్టు నుండి కాయలు కోసేందుకు వెళ్లాడు. ఇనుప కమ్మీతో కొబ్బరికాయలు కోస్తుండగా ఆ కమ్మీ ఇంటి ప్రహరీకి ఆనుకుని ఉన్న విద్యుత్ వైరును తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఆయన అక్కడికక్కడే మరణించాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

వేళచ్చేరిలో వంద కేజీల గుట్కా స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి వంద అడుగుల రహదారిలో మంగళవారం రాత్రి పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో వంద కేజీల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా వచ్చిన కారును పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేయగా, అందులో గుట్కా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తిరుపత్తూరుకు చెందిన కారు డ్రైవర్ తంగరాజ్ (40)ను పోలీసులు అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

'లాకప్ డెత్'లు జరగకూడదు...!

● జైళ్ల శాఖ డీజీపీ

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ లాకప్ డెత్‌లకు అవకాశం ఉండకూడదని జైళ్లశాఖ డీజీపీ అమరేష్ పుజారి ఆ శాఖ డీఐజీలు, వార్డెన్లు, ప్రత్యేక అధికారులను ఆదేశించారు. జైళ్ల నుంచి ఖైదీలు తప్పించుకోకుండా గస్తీ పటిష్టం చేయాలి, జైళ్లలో ఖైదీలు ఆత్మహత్యకు పాల్పడడమో, లాకప్ డెత్‌లు తదితరాలు జరగకుండా చూసుకోవాలని, జైళ్లలో ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదే సమయంలో, అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో అధికారులు సెలవులు తీసుకోవద్దని, సెలవు రోజుల్లో కూడా విధుల్లో ఉండాలని జైళ్ల శాఖ డీజీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నకిలీ పాస్‌పోర్ట్‌తో వచ్చిన ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నకిలీ పాస్‌పోర్ట్‌తో వచ్చిన ముగ్గురిని తిరుచ్చి విమానాశ్రయ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా వున్నాయి... తిరుచ్చి నుంచి సోమవారం రాత్రి 'ఎయిర్ ఏసియా' విమానంలో మలేసియా వెళ్లే ప్రయాణికులను ఇమ్మిగ్రేషన్ అధికారులు తనిఖీలు చేశారు. ఆ సమయంలో నాగపట్టణం జిల్లాకు చెందిన చెల్లదురై (48), రామనాధపురం సాహల్ హమీద్ (40), మంగళవారం ఉదయం సింగపూర్ వెళ్లేందుకు వచ్చిన పుదుకోటకు చెందిన పాండ్యన్ (48) నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి పాస్‌పోర్ట్ పొందినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై అధికారుల ఫిర్యాదు మేరకు విమానాశ్రయ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

నగరంలో 30 పాములు పట్టివేత

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరదల సమయంలో ఇళ్లలోకి వచ్చిన 30 పాములను బంధించినట్లు అగ్నిమాపక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నగరంలో తుపాను కారణంగా కురిసిన వర్షాలకు వరద నీటిలో పాములు వచ్చినట్లయితే తమకు సమాచారం అందించాలని అగ్నిమాపక శాఖ ప్రకటించింది. ఆ ప్రకారం, సోమవారం థౌజండ్ లైట్స్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు బ్యాంక్, వలసరవాక్కం అష్టలక్ష్మి నగర్‌లోని ఓ ఇంట్లో చొరబడిన పాములను అగ్నిమాపక సిబ్బంది బంధించారు. ఒకేరోజు 50 కాల్స్ రాగా, అక్కడకు చేరుకున్న సిబ్బంది 30 పాములను బంధించినట్లు అధికారులు తెలిపారు.

జిమ్‌లో వ్యాయామం చేస్తూ వ్యక్తి మృతి

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిమ్‌లో వ్యాయామం చేస్తూ ఓ వ్యక్తి మృతి చెందడం చర్చనీయాంశమైంది. వివరాలిలా వున్నాయి... స్థానిక మీంజూరు సమీపం వల్లూర్ ఈబీ నగర్‌కు చెందిన వినోద్‌కుమార్ (35) వల్లూరు థర్మల్ విద్యుత్ కేంద్రంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతను మంగళవారం యధావిధిగా అత్తిపట్టు ప్రాంతంలో ఉన్న జిమ్‌కు వెళ్లాడు. వ్యాయామం చేస్తున్న సమయంలో వినోద్‌కుమార్ హఠాత్తుగా గుండెపోటుకు గురికావడంతో సహచరులు అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై మీంజూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

లిఫ్ట్ పేరుతో నగల చోరీ

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బైకుపై వెళ్లేందుకు లిఫ్ట్ అడుగుతూ చోరీకి పాల్పడిన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు ... పెరుంగళత్తూర్‌కు చెందిన ఫిలిప్‌రాబర్ట్ ఘటన జరిగిన రోజు ద్విచక్రవాహనంపై అడయార్ వైపు బయల్దేరాడు. తిరువాన్మియూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఫిలిప్ వెళ్తుండగా, ఇద్దరు యువకులు లిఫ్ట్ అడిగారు. వారిని వాహనంలో ఎక్కించుకొని వెళుతున్న సమయంలో వెనుకగా కూర్చున్న వ్యక్తి ఫిలిప్ మెడలో నగ చోరీ చేశాడు. వారి దిగి వెళ్లిన తర్వాత నగ అదృశ్యమైన విషయం గ్రహించి ఫిలిప్ ఫిర్యాదు చేయడంతో తిరువాన్మియూర్ పోలీసులు కేసు నమోదుచేసి ఆగంతకుల కోసం గాలిస్తున్నారు.

విల్లుపురంలో 12కు పెరిగిన మృతుల సంఖ్య

టి.నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలు, వరదల కారణంగా విల్లుపురం జిల్లాలో మృతి చెందినవారి సంఖ్య 12కు చేరినట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. ఫెంగల్ ప్రభావిత వర్షాల సమయంలో ఇళ్లు కూలడం, విద్యుదాఘాతం, వాననీటి ప్రవాహంలో కొట్టుకుపోవటం వంటి సంఘటనల్లో ఏడుగురు మరణించారు. తాజాగా మరో ఐదుగురు మృతి చెందారు. తిరువెన్నై నల్లూరు సమీపం ఏనాదిమంగళం ప్రాంతంలో ఓ ఇంటిలో వర్షపు నీరు చొరబటంతో నీటి ఉధృతికి క్లైయరసన్ (54) అనే రైతు ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సుమారు కిలోమీటర్ దూరంలో నీటి ప్రవాహంలో అతడి శవం కొట్టుకుపోతుండగా అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపారు. శేర్దనూరులో నావమ్మాల్ (50) ఇంటి వెనుక వాననీటి ప్రవాహంలో జారి పడి ప్రాణాలు కోల్పోయింది. విక్రవాండి సమీపం వి.సాత్తనూరుకు చెందిన ధనలక్ష్మి (85) ఇంటి ముంగిట వాననీటి కాల్వలో పడి మృతి చెందింది. ఇదే విధంగా ధనభాగ్యం (81), మరగదపురం వద్ద గుర్తు తెలియని 50 యేళ్ల వయస్సుగల మహిళ వరదలో కొట్టుకుపోయి మృతి చెందారు.

బాలికకు గర్భం... యువకుడి కోసం గాలింపు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు సమీపంలో బాలిక ప్రసవించిన వ్యవహారంలో ప్రియుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కోయంబేడు మహిళా పోలీస్‌స్టేషన్‌లో గత నెల 21వ తేది ఓ మహిళ అందజేసిన ఫిర్యాదులో... తన 14 ఏళ్ల కుమార్తెను ఓ యువకుడు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడని, ప్రస్తుతం తన కుమార్తె 9 నెలల గర్భవతి అని ఫిర్యాదులో పేర్కొంది. ఈ వ్యవహారంపై పోలీసులు చేపట్టిన విచారణలో... సాలిగ్రామానికి చెందిన తరుణ్ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి, ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో, సోమవారం ఎగ్మూర్ చిన్నపిల్లల ఆస్పత్రిలో బాలిక ఓ ఆడపిల్లకు జన్మనిచ్చింది. కేసు నమోదుచేసిన పోలీసులు పరారీలో ఉన్న తరుణ్ కోసం గాలిస్తున్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు

● బీజేపీ నేత అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేట భారతీపురానికి చెందిన సతీష్ (45) చెంగల్పట్టు నార్త్ బీజేపీ ప్రచార విభాగం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అతను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ద్రావిడం గురించి అసత్య ప్రచారం చేస్తున్నట్లు డీఎంకే ఐటీ వింగ్ నిర్వాహకులు రవిచంద్రన్ తాంబరం పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై శంకర్ నగర్ పోలీసులు కేసు నమోదుచేసి మంగళవారం సతీష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

రెండేళ్ల చిన్నారిపై దాడి

● తల్లిదండ్రులను విచారిస్తున్న పోలీసులు

ఐసిఎఫ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల చిన్నారిపై దాడిచేసిన వ్యవహారంలో తల్లిదండ్రులను పోలీసులు విచారిస్తున్నారు. చెంగల్పట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండేళ్ల చిన్నారిని ఆమె తండ్రి దాడిచేశారంటూ చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరు 109కు ఫిర్యాదు అందింది. ఈ విషయమై చెంగల్పట్టు జిల్లా పిల్లల సంరక్షణ విభాగం అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. చిన్నారి తల్లిదండ్రులు ప్రేమ వివాహం చేసుకున్నారని, ప్రస్తుతం విభేధాల కారణంగా వేర్వేరుగా ఉంటున్న నేపథ్యంలో, చిన్నారిపై తండ్రి దాడి చేసినట్లు గుర్తించారు. అలాగే, చిన్నారి చేతిపై కాలిన గాయం ఉండడంతో, ఆ వ్యవహారంపై అధికారులు విచారిస్తున్నారు. కాగా, అధికారుల ఫిర్యాదుతో చెంగల్పట్టు నగర పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బెయిలుపై విడుదలై పరారైన రౌడీ అరెస్టు

ఐసిఎఫ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూరులో 2021లో జరిగిన రౌడీ శివకుమార్ హత్యకేసులో బెయిలు పొంది పరారైన మరో రౌడీని పోలీసులు అరెస్టు చేశారు. ఆ హత్యకేసులో నిందితులైన రౌడీలు అళగురాజ, పాండ్యన్ సహా ఐదుగురు కళ్ళకురిచ్చి కోర్టులో లొంగిపోయారు. వీరిలో పాండ్యన్ బెయిలుపై విడుదలై కోర్టు విచారణకు హాజరుకాకుండా పారిపోయాడు. పోలీసులు గాలించి మంగళవారం పాండ్యన్‌ను అరెస్టు చేశారు.

మద్యం మత్తులో గొడవ: డ్రైవర్ హత్య

ఐసిఎఫ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుండ్రత్తూరు సమీపంలో మంగళవారం రాత్రి మందుపార్టీలో స్నేహితుల మధ్య జరిగిన గొడవలు ఒకరి హత్యకు దారితీసాయి. కుండ్రత్తూరు ఒండి కాలనీ అగ్నీశ్వరర్ కోవిల్ వీధికి చెందిన డ్రైవర్ విజయ్ (29) సోత్మలయంబాక్కం సమీపంలో స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. ఆ సందర్భంగా వారి మధ్య గొడవ జరిగి, స్నేహితులంతా కలిసి అతడిని చితకబాది, తలపై బండరాయితో బాది హత్య చేసి పారిపోయారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కుండ్రత్తూరు పోలీసులు సంఘటన ప్రాంతానికి వెళ్ళి విజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

తిరుప్పూర్ మార్కెట్‌లో 330 కేజీల చైనా వెల్లుల్లి స్వాధీనం


తిరుప్పూర్ మార్కెట్‌లో ఆహార భద్రతా విభాగం అధికారుల తనిఖీలు

ప్యారీస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు మార్కెట్‌లో ఆరోగ్యానికి హానికలిగించే 330 కిలోల చైనా వెల్లుల్లిని ఆహార భద్రతా విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మార్కెట్‌లో రాష్ట్రంలో నిషేదించిన చైనా దేశపు వెల్లుల్లి విక్రయిస్తున్నారనే సమాచారంతో బుధవారం ఉదయం తిరుప్పూరు జిల్లా ఆహార భద్రతా విభాగం అధికారిని విజయ లలితాంబిక నేతృత్వంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మార్కెట్‌లో పలు ప్రాంతాల్లో దాచిన 330 కిలోల చైనా వెల్లుల్లిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వెల్లుల్లిని పరిశోధన కోసం ల్యాబ్‌కు పంపించిన అధికారులు జిల్లా వ్యాప్తంగా మార్కెట్లు, గోదాముల్లో కూడా సోదాలు చేపట్టారు.

నాగపట్టినంలో...

టి.నగర్): రాష్ట్రంలో వెల్లుల్లి ధరలు విపరీతంగా పెరగటంతో నాగపట్టినంలో చైనా వెల్లుల్లి విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే చైనా వెల్లుల్లి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు జిల్లా ఆహార భద్రతా శాఖ అధికారులకు సమాచారం అందటంతో వారు దుకాణాల్లో తనిఖీలు చేశారు. పది దుకాణాల నుండి వంద కేజీలకు పైగా చైనా వెల్లులి స్వాధీనం చేసుకున్నారు.



సచివాలయంలో 'మీ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి' పథకం అమలుపై అధికారులు, మంత్రులతో సమావేశమైన సీఎం స్టాలిన్

జెమ్ ఆస్పత్రిలో ప్యాంక్రియాటిక్ రోగుల కోసం హెల్ప్‌లైన్



మీడియా సమావేశంలో జెమ్ వ్యవస్థాపకుడు డాక్టర్ సి. పళనివేల్ తదితరులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి జెమ్ హాస్పిటల్ ప్యాంక్రియాటిక్ వ్యాధులకు సంబంధించి సమాచారం తెలుసుకునేందుకు 24 గంటల హెల్ప్ లైన్ ప్రారంభించింది. ఈ డిజార్డర్‌తో బాధపడేవారు 70920 51931 అనే ఫోన్ నంబరులో సంప్రదించవచ్చని హాస్పిటల్ ఫౌండర్ డాక్టర్ సి.పళనివేల్ వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన బుధవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నగరంలో ప్యాంక్రియాటిక్ రోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుందన్నారు. గత వారం రోజుల్లో తమ ఆస్పత్రికి చెందిన వైద్యుల బృందం ఆరు రకాలైన లాప్రోస్కోపిక్, రోబోటిక్, సంక్లిష్ట వాస్కులర్ రెసురేషన్స్ చికిత్స చేశారన్నారు. ఈ తరహా డిజార్డర్‌తో బాధపడేవారికి తక్షణ వైద్య సాయం అందించేందుకు ఈ హెల్ప్‌లైన్ అందుబాటులోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు.

బెంగళూరుకు రెండు విమానాల మళ్లింపు

ఐసిఎఫ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరానికి వచ్చిన రెండు అంతర్జాతీయ విమానాలను బెంగళూరు మళ్లించారు. మలేసియా, దుబాయ్ నుంచి నగరానికి వచ్చిన రెండు అంతర్జాతీయ విమానాలను హఠాత్తుగా బెంగళూరుకు మళ్లించారు. నిర్వహణ కారణాలతో విమానాలను బెంగళూరుకు మళ్లించినట్లు సమాచారం.

తుపాను బాధితుల కోసం ఎస్కే సాయం



ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి రూ.10లక్షల చెక్కు అందజేస్తున్న శివ కార్తికేయన్

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి హీరో శివకార్తికేయన్ రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఉప ముఖ్యమంత్రి, సినీ హీరో ఉదయనిధిని కలుసుకుని ఈ చెక్కును అందజేశారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. అలాగే, వరద బాధితులను ఆదుకునేందుకు వ్యాపార, సినీ రాజకీయ ప్రముఖులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. శివకార్తికేయన్ హీరోగా నటించిన 'అమరన్' చిత్రం అక్టోబరు నెలలో విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే.

ఆస్పత్రిలో చేరిన పవర్‌స్టార్



ఆస్పత్రిలో పవర్‌స్టార్ శ్రీనివాసన్

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళ సినీ నటుడు పవర్ స్టార్ శ్రీనివాసన్ అనారోగ్యం కారణంగా బుధవారం ఆస్పత్రిలో చేరారు. మూత్రనాళ సమస్యల కారణంగా ఆయన గిండీలోని కలైంజర్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరారు. ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతానికి ఆయన ఆరోగ్యం బాగానే ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

చిత్రజ్యోతి

నిర్మాత సీవీ కుమార్ ఓ విశ్వవిద్యాలయం : 'మిర్చి' శివ

● 'సూదు కవ్వుం-2' ఆడియో రిలీజ్



ఆడియో రిలీజ్ దృశ్యం

డెబ్యూ డైరెక్టర్ ఎస్‌జే అర్జున్ దర్శకత్వంలో మిర్చి శివ హీరోగా నటించిన తాజా చిత్రం 'సూదు కవ్వుం-2'. ఆడియో, ట్రైలర్ నగరంలో తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో మిర్చి శివతో పాటు హరీషా జస్టిన్, వాగై చంద్రశేఖర్, రాధా రవి, ఎంఎస్ భాస్కర్, అరుల్‌దాస్, కల్కి, కరాటే కార్తీ తదితరులు నటించారు. తిరుకుమరన్ ఎంటర్‌టైన్మెంట్, తంగం సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ నెల 13వ తేదీ షణ్ముగ ఫిలిమ్స్ కె.సురేష్ ఈ సినిమా రిలీజ్ చేయనున్నారు. ఇదిలావుండగా ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ మంగళవారం నగరంలో జరిగింది. ఇందులో దర్శకుడు పా.రంజిత్, కార్తీక్ సుబ్బరాజ్, నలన్ కుమారస్వామి, ఆర్.రవికుమార్, ఏఆర్కే. శరవణన్‌తో పాటు నటుడు బాబీ సింహా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొనగా, వీరితో పాటు చిత్ర యూనిట్ సభ్యులంతా కలిసి ఆడియో రిలీజ్ చేశారు. ఈ చిత్రం ద్వారా తమిళ చిత్ర పరిశ్రమకు ఎడ్విన్ లూయిస్ విశ్వనాథ్ సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దీంతో ఈ వేడుకలో ఆయన ఈ చిత్రంలోని పాటలన్నీ లైవ్‌గా పాడి అలరించారు. ఈ సందర్భంగా హీరో మిర్చి శివ మాట్లాడుతూ, 'నిర్మాత సీవీ కుమార్ తమిళ సినిమా ఆస్తి. ఆయన ఓ విశ్వవిద్యాలయం. ఆ వర్సిటీలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోయినప్పటికీ ఎంతో మంది ప్రతిభావంతులైన నటీనటులను, టెక్నీషియన్లను తయారు చేసి ఇండస్ట్రీకి అందించారు. భవిష్యత్‌లో అనేక మంది కొత్త నటీనటులను పరిచయం చేయాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. దర్శకుడు అర్జున్ మాట్లాడుతూ, 'రంజిత్, నలన్ కుమారస్వామి, కార్తీక్ సుబ్బరాజ్ తదితరుల వద్ద అసిస్టెంట్‌గా పనిచేశారు. ఇపుడు వారందరినీ ఒకే వేదికపై చూస్తుంటే భయం కలుగుతుంది. ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు రుణపడివుంటాను. ఈ జర్నీలో నాతో కలిసి ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

13న 'మిస్ యూ' విడుదల



'మిస్ యూ'లో సిద్ధార్థ్ - ఆషికా రంగనాథ్

ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో సిద్ధార్థ్ - ఆషికా రంగనాథన్ జంటగా నటించిన 'మిస్ యూ' చిత్రాన్ని ఈ నెల 13వ తేదీ విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థ తాజాగా అధికారికంగా వెల్లడించింది. వాస్తవానికి గత నెల 29వ తేది ఈ చిత్రం విడుదలకావాల్సి వుంది. ఫెంగల్ హెచ్చరికల నేపథ్యంలో చిత్రం విడుదల వాయిదా వేశారు.. ఈ సినిమాను రెడ్ జెయింట్ మూవీస్ రాష్ట్ర వ్యాప్తంగా రిలీజ్ చేస్తుంది. పరిస్థితులు చక్కబడటంతో ఈ నెల 13వ తేదీ విడుదల చేయాలని నిర్మాత నిర్ణయించారు. కాగా, జిబ్రాన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో బాల శరవణన్ ఓ ముఖ్య పాత్ర పోషించారు.

సిల్వర్ జూబ్లీ దర్శకుడు బాల

● 18న వేడుకలు?



బాల

సినీ దర్శకుడు బాలాకు సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్టు వినికిడి. 1999, డిసెంబరు 10వ తేదీన విడుదలైన 'సేతు' చిత్రం ద్వారా బాలా కోలీవుడ్ దర్శకుడుగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'నందా', 'పితామగన్', 'అవన్ ఇవన్', 'పరదేశి' వంటి పలు హిట్ చిత్రాలను నిర్మించి స్టార్ దర్శకుడిగా గుర్తింపు పొందారు. ఆయన తెరకెక్కించిన పలు చిత్రాలు పరాజయంపాలైనప్పటికీ ఆయన మేకింగ్‌ని ప్రతి ఒక్కరూ ప్రశంసించేవారు. ప్రస్తుతం అరుణ్ విజయ్ హీరోగా 'వణంగాన్' అనే పేరుతో రూపొందస్తుండగా, వచ్చే యేడాది సంక్రాంతికి విడుదలకానుంది. ఈ సినిమా ఆడియో రిలీజ్ వేడుకను ఈ నెల 18వ తేదీ గ్రాండ్‌గా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ వేడుకతోనే బాలా చిత్రపరిశ్రమలోకి 25 యేళ్ళు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలని బావిస్తున్నారు.

మన్సూర్ అలీఖాన్ కొడుకు అరెస్టు



అలీఖాన్ తుగ్లక్

గంజాయి విక్రయ కేసులో ప్రముఖ సినీ నటుడు, దర్శక నిర్మాత మన్సూర్ అలీ ఖాన్ కుమారుడు అలీఖాన్ తుగ్లక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల నగరంలోని పలు కళాశాలల విద్యార్థులకు గంజాయి విక్రయిస్తూ 10 మంది పోలీసులకు చిక్కారు. వారిని విచారించగా తుగ్లక్‌కు సంబంధం ఉన్నట్టు వెల్లడించారు. ఫోనులో పలు మార్లు సంప్రదించి గంజాయి సరఫరా చేసినట్టు పేర్కొన్నారు. దీంతో తుగ్లక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కొన్ని గంటల పాటు విచారణ జరిపి, అరెస్టు చేసినట్టు బుధవారం ఉదయం ప్రకటించారు. అలాగే, తుగ్లక్‌తో సంబంధం ఉన్న మరో నలుగురిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. కాగా, అలీఖాన్ తుగ్లక్ 'కడమాన పారై' అనే చిత్రం ద్వారా హీరోగా వెండితెరకు పరిచయమయ్యాడు. ఈ చిత్రాన్ని మన్సూర్ అలీఖాన్ దర్శకత్వం వహించి సొంతంగా నిర్మించారు.

పేద విద్యార్థులకు సుమంగళ స్టీల్ ఉపకార వేతనాలు



విద్యార్థినికి ఉపకారవేతనాన్ని అందజేస్తున్న మంత్రి మహేశ్

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద (సీఎస్ఆర్) సుమంగళ స్టీల్ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేస్తోంది. ఇందులో భాగంగా, ఈ దఫా ప్లస్ పబ్లిక్ పరీక్షల్లో 70 శాతం మార్కులు సాధించిన పేద విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఉపకార వేతనాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసింది. బుధవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. ఈ కార్యక్రమంలో సుమంగళ స్టీల్స్ సీఎండీ రాజేంద్ర సభానాయగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహిస్తూ ఉపకారవేతనాలు అందజేస్తున్న కంపెనీ యాజమాన్యాన్ని మంత్రి అన్బిల్ అభినందించారు.



ఆలయం నుంచి వస్తున్న కమిటీ సభ్యులు

పళని ఆలయంలో జస్టిస్ పొన్ కాళియప్పన్ కమిటీ

● నవపాషాణ విగ్రహం పటిష్ఠత పరిశీలన

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో మూడవదైన పళని దండాయుధపాణి పర్వతాలయంలో మాజీ న్యాయమూర్తి పొన్ కాళియప్పన్ కమిటీ బుధవారం పరిశీలన చేపట్టింది. ఆ ఆలయ గర్భాలయంలో మహాసిద్ధ పురుషుడైన బోగర్ మహర్షి ప్రతిష్ఠించిన కౌపీనధారుడైన స్వామివారి నవపాషాణ విగ్రహాన్ని ఈ కమిటి పరిశీలించింది. ఆలయంలోని నవపాషాణ మూలవిరాట్టుకు ఎక్కువగా అభిషేకాలు చేయటం వల్ల ఆ విగ్రహం అరిగిందని, బలహీనపడిందని పుకార్లు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఆ విగ్రహాన్ని పరిశీలించేందుకు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ పొన్ కాళియప్పన్ నాయకత్వంలో ప్రత్యేక కమిటీ నియమించింది. ఆ కమిటీలో స్థపతి దక్షిణామూర్తి, ఐఐటీ నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జస్టిస్ పొన్ కాళియప్పన్ కమిటీ బుధవారం ఉదయం ఆ ఆలయానికి వెళ్ళారు. స్వామివారికి మధ్యాహ్నం వరకూ పూజలు జరిగిన తరవాఅత కమిటీ సభ్యులను గర్భాలయంలోకి ఆలయ నిర్వాహకులు అనుమతించారు. సుమారు అరగంట పాటు వీరంతా నిశితంగా పరిశీలించి బయటకు వచ్చారు. ఈ కారణంగా స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు సుమారు ముప్పావు గంట వేచి ఉండాల్సి వచ్చింది. జస్టిస్ పొన్ కాళియప్పన్ కమిటీ సమగ్రంగా పరిశీలించిన మీదట హైకోర్టుకు నవపాషాణ విగ్రహం పటిష్ఠతకు సంబంధించి నివేదిక సమర్పించనుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌తో డీఎంకే ఎమ్మెల్యే భేటీ

టి.నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి తూర్పు నియోజకవర్గం డీఎంకే శాసనసభ్యుడు, క్రైస్తవ మైత్రీ సమాఖ్య అధ్యక్షుడు ఇనికో ఇరుదయరాజ్ పోప్ ఫ్రాన్సిస్‌ను కలుసుకున్నారు. పోప్ ఫ్రాన్సిస్ ఆహ్వానం మేరకు ఇరుదయరాజ్ వాటికన్ సిటిలో ఆయనతో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ నుంచి ఆశీర్వచనాలను అందుకున్నారు. తమిళనాట డీఎంకే ప్రభుత్వం మైనారిటీ క్రైస్తవ ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. చివరగా పోప్‌ను భారతదేశంలో పర్యటించాలని ఇనికో ఇరుదయరాజ్ ఆహ్వానించారు. భారతదేశం వస్తే తప్పకుండా తమిళనాట పర్యటించాలని కూడా ఆయన పోప్ ఫ్రాన్సిస్‌కు విజ్ఞప్తి చేశారు.



వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్‌తో డీఎంకే ఎమ్మెల్యే ఇనికో ఇరుదయరాజ్

స్వామిమలై ఆలయంలో నేడు కార్తీక దీపోత్సవాల ప్రారంభం



స్వామిమలై ఆలయం

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆరుదివ్యక్షేత్రాల్లో నాలుగోదైన స్వామిమలై స్వామినాథన్ ఆలయంలో కార్తీక మహాదీపోత్సవాలు గురువారం ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆలయంలో ప్రతియేటా కార్తీక దీపోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆ మేరకు ఈ యేడాది కార్తీక మహాదీపోత్సవాలు గురువారం ఉదయం ఏడు గంటలకు అనుజ్ఞ, విఘ్నేశ్వరపూజ అనంతరం ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. ఆ తర్వాత వినాయకుడు, వళ్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి పరివార దేవతా మూర్తులతో పర్వతాలయం నుంచి ఉత్సవ మండపంలో వేంచేయనున్నారు. రాత్రి యాగశాల పూజ, స్వామివారి ఊరేగింపు దిగ్బంధన కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం ప్రతిరోజూ మేష వాహనం, పంచమూర్తుల సప్పరం, గజవాహనం, కామధేను వాహనం, రజత అశ్వవాహనం తదితర వాహనాల్లో స్వామివారు ఊరేగనున్నారు. ఈ ఉత్సవాల్లో అత్యంత కీలకఘట్టమైన కార్తీక మహాదీపోత్సవం రోజున ఈ నెల 13 ఉదయం రథోత్సవం, రాత్రి స్వర్ణ మయూరవాహనంలో స్వామివారి ఊరేగనున్నారు. 14న సుబ్రహ్మణ్యస్వామి బయలుదేరి కావేరి నదీ తీరంలో తీర్థవారి సేవలు అందుకుంటారు. రాత్రి అక్కడి నుంచి ఆలయానికి చేరుకుంటారు. ఈ నెల 15 రాత్రి వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి యథాస్థానంలో కొలువుదీరి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ ఉత్సవాలకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శివకుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఉమాదేవి, ఆలయ ట్రస్టీలు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

మెరీనాబీచ్‌లో రోప్‌కార్ సేవలు

● 17లోగా గ్లోబల్ టెండర్లకు ఆహ్వానం



బీచ్‌లో రోప్‌కార్ (ఊహాచిత్రం)

టి.నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత అందమైన అతి పొడవైన బీచ్‌లలో ద్వితీయస్థానంలో ఉన్న చెన్నై మెరీనాబీచ్‌లో రోజూ వచ్చే సందర్శకులకు రోప్‌కార్ సేవలు అందించాలని జీసీసీ సంకల్పించింది. ప్రస్తుతం మెరీనాబీచ్ లైట్‌హౌస్ ప్రాంతం నుంచి పూందమల్లి వరకు మెట్రోరైలు మార్గం తవ్వకం పనులు చురుకుగా జరుగుతున్నాయి. మెరీనా గాంధీ విగ్రహం కూడలి దిగువ భూగర్భంలో మెట్రోరైలు సొరంగమార్గంలో పరుగులు తీయనున్నాయి. ఈ నేపథ్యంలో 'సింగార చెన్నై 2.0' అమలులో భాగంగా మెరీనాబీచ్ వద్ద రోప్ కార్ ప్రాజెక్టు చేపట్టేందుకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో టెండర్లను ఆహ్వానిస్తూ గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రకటన జారీ చేసింది. ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేయాలని ఆ ప్రకటనలో పేర్కొంది.

వేట్టయన్ చెరువుకు 22 యేళ్ల తర్వాత జలకళ

● జంతుబలులిచ్చి పండుగ చేసుకున్న రైతులు



చెరువు ప్రాంతం వద్ద జంతుబలికి పూజలు

టి.నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా మొరాప్పూరు సమీపంలో ఎం.వేట్రాపట్టి గ్రామంలోని వేటయ్యాన్ చెరువు 22 యేళ్ల తరవాఅత పూర్తిస్థాయిలో నిండటంతో స్థానిక రైతుల సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది. ఈ చెరువు నీటిపై ఆధారపడే రైతులు వ్యవసాయం చేస్తుండేవారు. తాగునీటికి కూడా ఆ చెరువు నీళ్లనే ఉపయోగిస్తుండేవారు. కొన్నేళ్లుగా ఈ చెరువులో నీళ్ల లేక పూర్తిగా ఎండిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు వేట్టయ్యాన్ చెరువు పూర్తిస్థాయిలో నిండింది. దీనితో స్థానిక రైతులు ఆ చెరువు వద్ద మేకపోతులను బలిచ్చి పండుగ చేసుకున్నారు.

రేలా, బాలాజీ డెంటల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో లండన్ రాయల్ కాలేజీ కోర్సులకు పరీక్షలు



సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ మహమ్మద్ రేలా, బాలాజీ డెంటల్ కాలేజీ డీన్ డాక్టర్ కన్నన్, వైద్యనిపుణులు, రాయల్ కాలేజీ నిర్వాహకులు

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా హాస్పిటల్, బాలాజీ డెంటల్ కాలేజీ ఆస్పత్రి సహకారంతో లండన్ గ్లాస్కోనగరంలోని రాయల్ కాలేజీ ఆఫ్ సర్జన్స్ అండ్ ఫిజీషియన్స్ వార్షిక సభ్యత్వ పరీక్షలు నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించిందని ఆ ఆస్పత్రి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ మహమ్మద్ రేలా మీడియా సమావేశంలో తెలిపారు. ఆ పరీక్షలను యునైటెడ్ కింగ్‌డమ్ వెలుపల నిర్వహించిన తొలి వైద్య సంస్థగా తమ ఆస్పత్రికి పేరు వచ్చిందని చెప్పారు. దంత వైద్యానికి సంబంధించిన రెండు విభాగాల పరీక్షల్లో మొదటి విభాగం పరీక్షలను ఈ నెల 2 నుండి 4 వరకు నిర్వహించామని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 46 మంది నిపుణులు, 18 మంది ఎగ్జామినర్లు ఈ పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్నారని తెలిపారు. మీడియా సమావేశంలో బాలాజీ డెంటల్ కాలేజీ డీన్ డాక్టర్ కన్నన్, భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (బీఐహెచ్ఈఆర్) రిజిస్ట్రార్ డాక్టర్ భూమినాథన్, రిసెర్చి డైరెక్టర్ డాక్టర్ బద్రీ తిరువేంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

కడలూరులో ఎన్నెల్సీ సహాయక చర్యలు

వరద బాధిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్నెల్సీ సీఎండీ ప్రసన్నకుమార్



● మోటర్లతో వరదనీటి తొలగింపు

● బాధితులకు 37 వేల ఆహారపొట్లాల పంపిణీ

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలకు వరదలు సంభవించిన కడలూరు జిల్లాలో ఎన్నెల్సీ ఇండియా సంస్థ ముమ్మర సహాయక చర్యలు చేపట్టింది. ఆ సంస్థ సీఎండీ మోటుపల్లి ప్రసన్నకుమార్ వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. కడలూరులో నాలుగు మోటార్లతో సంస్థ నిపుణులు 12 మందిని రంగంలోకి దింపి వరదనీటి తొలగింపు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. అంతే కాకుండా వరదబాధితులకు 37 వేల ఆహార పొట్లాలను, 2 వేల వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. బుధవారం కడలూరు జిల్లాలో వరద బాధిత ప్రాంతాల్లో చేపట్టనున్న సహాయకచర్యలు గురించి ఎన్నెల్సీ ఆ చర్యలలో పాలుపంచుకునే విషయంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వంతో ఎన్నెల్సీ సీఎండీ ప్రసన్నకుమార్ చర్చలు జరిపారు.

సూర్య, చంద్రులే వాహనాలుగా..







సకల జీవుల ప్రాణప్రదాతలు సూర్య, చంద్రులు. ఒకరు భగభగ మండి భయపెట్టినా, మరొకరు చల్లని వెన్నెలతో సేదదీరుస్తారు. ఈ ఇద్దరూ తిరుచానూరు పద్మావతమ్మకి వాహనాలుగా మారారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై గోవర్ధనగిరిధారియైన శ్రీకృష్ణుని అలంకారంలో అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి చంద్రప్రభపై భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 12 కళాబృందాలు 257 మంది కళాకారులు వాహనసేవల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

నేటితో ముగియనున్న వాహనసేవలు



నవంబరు 28న చిన్నశేషవాహనంతో మొదలైన వాహనసేవలు గురువారం రాత్రి అశ్వ వాహనసేవతో ముగుస్తాయి. తొమ్మిది రోజుల్లో 16 వాహనాలపై అమ్మవారు ఊరేగి భక్తులను కటాక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు: రథోత్సవం
సాయంత్రం 6 గంటలకు: ఊంజల్ సేవ
రాత్రి 7 గంటలకు: అశ్వవాహనం



గల్లంతైన షారూక్ మృతదేహం లభ్యం



చిట్టమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మల్లాం రొయ్యల కాలువ సమీపంలోని చప్టా వద్ద వరద ప్రవాహంలో గల్లంతైన షారూక్(23) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. మంగళవారం ఉదయం ఇద్దరు గల్లంతు కాగా.. మధుసూదన్‌రెడ్డి మృతదేహం లభించింది. బుధవారం తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్‌ఐ చిన్న బలరామయ్యలు సంఘటన స్థలానికి చేరుకొని షారూక్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారులు లోతైన ఈ గుంతలో వలలు వేసి గాలించగా షారూక్ మృతదేహం బయటపడింది. షారూక్ పనిచేసే చికెన్ షాపు యజమాని షేక్ జలీల్ అహ్మద్ చొరవతో అతడి మృతదేహాన్ని జార్ఖండ్ రాష్ట్రం రాహ గ్రామానికి అంబులెన్స్‌లో పంపారు.

పిడుగుపడి వలస కూలీ మృతి



వెంకటేశ్వరమ్మ (ఫైల్‌ఫొటో)

డక్కిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం శ్రీపురం గ్రామంలో బుధవారం పిడుగు పడి వలస కూలీ మృతి చెందారు.గుంటూరు జిల్లా నిజాంపట్టు మండలం అడువుల దీవి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ (30) వారం కిందట భర్త వెంకటేశ్వరరావుతో కలిసి వరినాట్లు వేసేందుకు గ్రామానికి వచ్చారు. బుధవారం పొలాల్లో వరినాట్లు వేస్తుండగా ఆమెపై పిడుగు పడడంతో కుప్పకూలారు. వెంటనే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమెకు భర్త, ఐదేళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉన్నారు.

పూర్వ చిత్తూరు డీఎంహెచ్‌వోపై విజిలెన్సు విచారణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూర్వ చిత్తూరు, ప్రస్తుత తిరుపతి డీఎంహెచ్‌వో శ్రీహరిపై విజిలెన్సు విచారణ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వోగా చేపట్టిన నియామకాలు, ఇతర అక్రమాలకు పాల్పడ్డారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటికే పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నాయి. 2020 నుంచి 2023 వరకు దాదాపు నాలుగు సార్లు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డాక్టర్లు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులు భర్తీ చేసిన విషయం విదితమే. ఇందులో అనర్హులకు పెద్దపీట వేసినట్లు విజిలెన్సు విచారణలో తేలినట్లు సమాచారం. ఇటీవల గుంటూరు డీఎంహెచ్‌వో విచారణ అధికారిగా వచ్చి పలు రికార్డులు సీజ్ చేసుకుని వెళ్లారు. ఇక, నిధుల దుర్వినియోగంపైనా విజిలెన్సు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వాటిని ఎందుకు డ్రా చేశారు? దేనికి ఖర్చు పెట్టారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

సహాయక చర్యలు చేపట్టాం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు సహాయక చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం మంగళగిరి సచివాలయం నుంచి హోం మంత్రి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తుఫాన్ వల్ల కొన్ని చోట్ల రోడ్లు, కాజ్‌వేలు దెబ్బతిన్నాయని వాటిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. ఓవర్‌ఫ్లో ఉన్న కాజ్‌వేలపై రోడ్లకు రోపులతో బందోబస్తు చేశామన్నారు. అటు వైపు ప్రజలు వెళ్లకుండా వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, పోలీసులను ఏర్పాటు చేశామన్నారు.

అలిపిరి చెక్‌పాయింట్ వద్ద 'కిస్సిక్'

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ ముందు ఓ యువతి 'పుష్ప2' చిత్రంలోని 'కిస్సిక్' పాటకు డ్యాన్స్ చేసి తన ఇన్‌స్టా పేజ్‌లో పోస్ట్ చేసింది. ఈ చర్య తీవ్ర విమర్శలకు దారి తీసింది. స్వామి నామాల ముందు ఇదేం పని అంటూ భక్తులు ఆగ్రహించారు. దీంతో ఆమె క్షమాపణ చెబుతూ సాయంత్రానికి మరో వీడియోను పోస్ట్ చేసింది.

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్టు

● వాహనంతో పాటు కత్తి స్వాధీనం



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ వెంకటనారాయణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసిన ప్రియురాలే కిడ్నాప్ చేయించిన ఘటనలో ఆరుగురు నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తిరుపతి నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కలవకుంట పంచాయతీ రేణుకానగర్‌కు చెందిన వడ్డే శ్రీనివాసులు అలియాస్ నాని కొన్నేళ్ల కిందట తిరుపతికి వచ్చారు. పెద్దకాపులేవుట్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని హోం స్టే నడుపుతున్నారు. మూడేళ్ల కిందట భర్త చనిపోవడంతో మదనపల్లెకు చెందిన సోనియాభాను ఉపాధి నిమిత్తం తిరుపతికి వచ్చారు. ఎనిమిది నెలల కిందట శ్రీనివాసులుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అతడికి వివాహం కానందున ఇద్దరూ కలిసి సహజీవనం చేస్తున్నారు. ఆమె ఇద్దరి పిల్లలనూ తమ వద్దే ఉంచుకున్నారు. నెల కిందట వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకుని మదనపల్లెకు వెళ్లిపోయింది. తరచూ శ్రీనివాసులు ఆమెకు ఫోన్ చేసి తిరుపతికి రావాలని కోరారు. శ్రీనివాసులతో తన బిడ్డలకు ప్రాణహాని ఉంటుందేమోని భావించిన సోనియాభాను.. తమ బంధువైన మదనపల్లెలో పాత కేసుల్లో నిందితుడైన బాబా పక్రుద్దీన్‌ను సంప్రదించింది. కిడ్నాప్ చేసి కాలు, చేయి తీసేయాలని భావించిన పక్రుద్దీన్.. తన స్నేహితులు రియాజ్, మోక్షిత్ రాయల్, సందీప్‌కుమార్, రాజేషతో కలసి గత నెల 28న వాహనంలో హోంస్టే వద్దకు వచ్చారు. శ్రీనివాసులుపై దాడిచేసి, కత్తితో బెదిరించి లాక్కెళ్లారు. ఈ కిడ్నాప్ ఘటనపై మీడియాలో స్క్రోలింగ్ రావడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, సిబ్బంది వాయల్పాడు పోలీసులను అప్రమత్తం చేశారు. వారు వాహనాల తనిఖీ చేపట్టారు. కిడ్నాపర్లు ఆదమరచి ఉండగా బాధితుడు శ్రీనివాసులు తప్పించుకుని తిరుపతికి చేరుకున్నారు. బాధితుడి సోదరుడు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమకు అందిన సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది కొర్లగుంట జంక్షన్ వద్ద కాపు కాచి అక్కడ వున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి వాహనం, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు.

కొట్టుకుపోయిన భూపతీశ్వర ప్రాజెక్టు అక్విడెక్ట్



సత్యవేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం టీపీకోట సమీపంలోని భూపతీశ్వర ప్రాజెక్టు కింద నిర్మించిన అక్విడెక్ట్ ఇటీవల వర్షాలకు కొట్టుకు పోయింది. దీంతో 500 ఎకరాల ఆయకట్టుకు ఈ సారి నీరందని పరిస్థితి నెలకొంది. అక్విడెక్ట్ నుంచి వచ్చిన నీటితో చెరువులు నిండితేనే పంటలు పండేవి. అక్విడెక్ట్ కుప్పకూలడంతో బీరకుప్పం, కడివేడు చెరువులకు రావాల్సిన నీరు రాళ్లవాగు మీదుగా సముద్రంలో కలిసిపోతోంది. ఆక్రమణదారుల వల్లే అక్విడెక్ట్ కూలిందని రైతులు ఆరోపించారు. గతేడాది చెన్నైకు చెందిన వ్యక్తి ప్రాజెక్టు దిగువన భూములను కొని చెంగాల్వను ఆక్రమించారు. స్థానిక వైసీపీ నాయకుడి సహకారంతో ప్రాజెక్టు నుంచి వచ్చే నీటి ప్రవాహానికి భూములు ముంపునకు గురి కాకుండా ప్రాజెక్టు రెండో తూము వద్ద ఎక్స్‌కవేటర్లతో లోతుగా కాలువ తీసి ప్రవాహ దిశను అక్విడెక్ట్ వైపు మళ్లించారు. దీంతో ప్రవాహ వేగం పెరిగి అక్విడక్ట్ కింద భాగం కోతకు గురై కొట్టుకు పోయిందని రైతులు చెబుతున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం వీటిని వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై విజయవాడ నుంచి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇతర అధికారులు బుధవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామాన్నీ సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22ఏకు సంబంధించిన భూ ఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుంచి ముందస్తు సమాచారంతో వినతులు స్వీకరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 50 శాతం రెవెన్యూ సమస్యలు ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని 1,051 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించాల్సి ఉంటుందని, జేసీ సమన్వయకర్తగా ఉంటారని, ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాల్లో సదస్సులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్డీసీ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మాదిగల అభివృద్ధి

● మందకృష్ణపై విమర్శలు చేస్తే సహించం ● ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడితోనే మాదిగలు అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తెలిపారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తున్న ఆయన పట్ల మాదిగలు అత్యంత విశ్వాసంతో ఉన్నారన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయం మేరకు రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలు సమానత్వంతో రిజర్వేషన్లు పొందాలని 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారేగానీ మాలలకు వ్యతిరేకం కాదన్నారు. కొందరు రాజకీయ లబ్ధికోసం మాల సోదరులను తప్పుదోవ పట్టిస్తూ మందకృష్ణ మాదిగపై విమర్శలు చేస్తే సహించమన్నారు. ఆ మాటలను వెనక్కు తీసుకోవాలన్నారు. బీసీల్లో ఉన్న వర్గీకరణ ఎస్సీల్లో ఉంటే తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. ఆగస్టు1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి రాజ్యాంగ బద్ధంగా మాలమాదిగలు కలిసి సమానత్వం కోసం కలిసిరావాలన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వర్గీకరణ ఆగదని, మీకు అన్యాయం జరిగినా మందకృష్ణ మాదిగ అండగా ఉంటారనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ప్రభుత్వం స్పందించి వర్గీకరణ పూర్తి చేసి నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు నరేంద్రమాదిగ, రామకృష్ణ, గోపి, రాజేంద్ర, వాసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.90కోట్లు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ద్వారా రూ.1,90,5,265 వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. గత నెల 6 నుంచి ప్రధాన, పరివార దేవతల వద్ద హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించామన్నారు. ఇందులో ఇంకా 106 గ్రాముల బంగారు, 466.100 కిలోల వెండి, 121 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు.

'వాహన్'లోనే ఆర్టీఏ సేవలు

తిరుపతి (రవాణా),డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఇకపై రవాణా శాఖ సేవల కోసం 'వాహన్' సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే వాడాలని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ బుధవారం తెలిపారు. 'ఈ ప్రగతి' సాఫ్ట్‌వేర్ ఇక అందుబాటులో ఉండదన్నారు. వాహన రిజిస్ట్రేషన్‌కు 'వాహన్‌డాట్‌పరివాహన్‌డాట్‌జీవోవీడాట్‌ఇన్, లైసెన్సు సేవల కోసం 'సారథిడాట్‌పరివాహన్‌డాట్‌జీవోవీడాట్‌ఇన్'లో లాగిన్ కావాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 62 కేంద్రాల్లో 12 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తిరుపతిలోని ఆర్వీ రెడ్డి, గాయత్రి కాలేజీలను ఇన్‌చార్జి వీసీ అప్పారావు తనిఖీ చేశారు.

8న 'రన్ ఫర్ తిరుపతి'



'రన్ ఫర్ తిరుపతి' కార్యక్రమాన్ని ఈనెల 8న నిర్వహించనున్నారు. శాప్, ఈగల్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా చేపట్టే ఈ కార్యక్రమానికి బుధవారం ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు బ్రోచర్లను విడుదల చేశారు. 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.60 వేల విలువ చేసే నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాఘువీణ పాల్గొన్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేయాలా?

● 94404 46130 నెంబరుకు కాల్ చేయండి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వెళుతున్నారా? మిమ్మల్ని ఎవరైనా డబ్బులు అడిగితే 94404 46130 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో అవినీతి అధికారుల భరతం పట్టడానికి సామాన్యులు ముందుకు రావాలని ఏసీబీ అధికారులు కోరుతున్నారు. దీనికోసం త్వరలో అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. ఇక, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించింది. రూ.3.32 కోట్లు ఆదాయం లభించినట్టు బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 60,301 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 20,222 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.